సాక్షి విశాఖపట్నం

సోమవారం। 4। నవంబర్। 2024




'స్మార్ట్' షాక్ 8లో

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చాపకింద నీరులా సాగుతోంది. విశాఖలో ఇప్పటికే 9,200 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు.



అసౌకర్యాల తీరం 8లో

విశాఖపట్నం వచ్చే పర్యాటకులెవరైనా రుషికొండ బీచ్‌ను సందర్శించాల్సిందే. ఈ బీచ్‌లో నిర్వహణ లేక కళ తప్పింది.



లేజర్ షో అదుర్స్ 8లో

న్యూస్‌రీల్

పంచారామాలకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు



పంచారామ దర్శనానికి ఆర్టీసీ బస్సులో పయనమవుతున్న భక్తులు

డాబాగార్డెన్స్: కార్తీక మాసంలో ఒక్క రోజులో పంచారామాలు దర్శనం చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించింది. ద్వారకా బస్‌స్టేషన్ నుంచి ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సు బయలుదేరింది. పంచారామాలను దర్శించుకునే భక్తుల కోసం ఆదివారాల్లో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు తెలిపారు. సూపర్ లగ్జరీ ప్రయాణ చార్జీ రూ.2,150, అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.2,100గా నిర్ణయించామన్నారు. పంచారామాలను దర్శించుకునే భక్తులు www.apsrtconline.in ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. రిజర్వేషన్ కౌంటర్ వద్ద కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 99592 25602, 90522 27083లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అప్పన్న సేవలో రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ రజని



జస్టిస్ రజనికి స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈవో

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ పి. రజని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు అష్టోత్తరంపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఏఈవో అందజేశారు.

నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

జూ ఆదాయం రూ.3.47 లక్షలు



వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సందర్శకులు

ఆరిలోవ: జూ పార్కులో ఆదివారం కార్తీక మాసం సందడి నెలకొంది. పిల్లలు, పెద్దలు వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సరదాగా గడిపారు. యువకులు బ్యాటరీ వాహనాలు, సైకిళ్లపై సందడి చేశారు. జూను ఆదివారం సందర్శించిన 3,988 మంది ద్వారా రూ.3,46,744 ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఈ నెల 5న నాగుల చవితి సందర్భంగా జూ పార్కు ఉదయం 7.30 గంటలకే తెరుస్తామన్నారు. పూజల కోసం వచ్చే భక్తులు ఎటువంటి బాణసంచా తీసుకురావద్దని సూచించారు.

48 ద్విచక్ర వాహనాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

బీచ్‌రోడ్డు: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఈస్ట్ డివిజన్ పరిధిలో ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీలు జరిగాయి. రేసింగ్ బైకులు, అధిక శబ్దం చేసే బైకులు, నంబర్ ప్లేట్లు లేని 48 బైకులను స్వాధీనం చేసుకుని.. మోటార్ వాహన చట్టం కింద కేసులు నమోదు చేశారు. అలాగే అధిక శబ్దం చేసే సైలెన్సర్లను తొలగించారు.

బాబూ.. బేల మాటలేల?



సొంత గనుల్లేక విలవిల్లాడుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్

ఈ కారణంగానే సెయిల్ కంటే 3 రెట్లు అదనంగా ఉత్పత్తి వ్యయం

ఈ విషయం తెలిసి కూడా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను నిందించేలా సీఎం వ్యాఖ్యలు

'విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి నేను ఒకటే చెబుతున్నాను.. ఇది ఆంధ్రుల మనోభావాలకు చెందిన ప్రాజెక్టు. ఉద్యోగులు, యాజమాన్యం ఒక్కటే గుర్తుపెట్టుకోవాలి. మంచి మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేసుకోవాలి. సమర్థవంతంగా ప్లాంట్‌ని నడిపించాలి. సెయిల్ మాదిరిగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించాలి?

ఇవీ.. పరవాడ పర్యటనలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయింపులో చొరవ తీసుకోవల్సిన ముఖ్యమంత్రి ఇలా మాట్లాడడంపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగ కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

- సెయిల్ మాదిరిగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించాలన్న సీఎం
- మరోవైపు నష్టాల బాటలో ఉన్న ఉక్కును వదిలేసి ప్రైవేట్‌కి కొమ్ముకాస్తున్న ప్రభుత్వం
- మండిపడుతున్న స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు

సాక్షి, విశాఖపట్నం: ఇటీవల పరవాడ పర్యటనలో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు సెయిల్‌కు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న తేడా తెలియదా అంటూ కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. సెయిల్‌కు సొంత గనులు ఉండటం వల్లే లాభాల బాటలో పయనిస్తోంది. సెయిల్‌కు, స్టీల్‌ప్లాంట్‌కు ఉత్పత్తి వ్యయంలో చాలా తేడా ఉంది. సెయిల్‌తో పోలిస్తే స్టీల్‌ప్లాంట్‌కు మూడు రెట్లు ఉత్పత్తి వ్యయం అవుతోంది. సొంత గనులు లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. ప్లాంట్‌కు గనులు కేటాయించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ కార్మిక సంఘాలు చంద్రబాబు, పవన్ దృష్టికి సొంతగనుల కేటాయింపు విషయాన్ని పలుమార్లు విన్నవించినా.. కేంద్రంతో ఒక్కసారి కూడా సంప్రదింపులు జరపలేదు. ఇప్పుడు మాత్రం.. లాభాల బాట నడిపించాల్సిన బాధ్యత ఉద్యోగులు, కార్మికులదే అన్నట్లుగా చంద్రబాబు మాట్లాడటంపై ఉక్కు పోరాట కమిటీ నాయకులు మండిపడుతున్నారు.

మేనేజ్‌మెంట్ బాధ్యత ఎవరిది బాబూ.?

స్టీల్‌ప్లాంట్‌కు మంచి మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేసుకోవాలంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపైనా కార్మికులు మండిపడుతున్నారు. ప్లాంట్‌కు ఉన్నతాధికారుల నియామకం, సీఎండీ నియామకం మొదలైన బాధ్యతలన్నీ కేంద్రం పరిధిలో ఉంటాయి. కేంద్రంలో ఉన్న ప్రభుత్వంతో జతకట్టిన టీడీపీ, జనసేన ఈ విషయంపై ఎప్పుడూ చర్చించిన పాపానపోలేదు. అలాంటిది.. మంచి మేనేజ్‌మెంట్‌ను ఉద్యోగులు ఏర్పాటు చేసుకోవాలని చంద్రబాబు అనడమేంటని ప్రశ్నిస్తున్నారు.

ఐదు నెలల్లో ఉక్కు కోసం ఏం చేశారు.?

ప్లాంట్‌ను కాపాడుకుంటామంటూ ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు ఈ ఐదు నెలల్లో పట్టించుకున్న పాపానపోలేదు. ఉద్యోగులు, కార్మికులకు ఉన్న సదుపాయాల్ని యాజమాన్యం కోత విధించినా స్పందించలేదు. ఉద్యోగుల వీఆర్ఎస్, మరో ప్లాంట్‌కు బదిలీలకు పూనుకున్నా.. ఉద్యోగుల హెచ్ఆర్ఏ తొలగించినా నోరెత్తలేదు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో యూనిట్‌కి రూ.8 చొప్పున విద్యుత్ చార్జీలు పెంచి వసూలు చేసినా మాట్లాడలేదు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎల్‌టీఏ(లాంగ్ ట్రావెల్ అలవెన్స్), లాంగ్‌లీవ్ ట్రావెల్ కన్‌సెషన్(ఎల్ఎల్‌టీసీ), ఎల్‌టీసీ(లీవ్ ట్రావెల్ కన్‌సెషన్) కూడా నిలిపేశారు. దీనికి తోడు చంద్రబాబు ప్రభుత్వం గోరుచుట్టుపై రోకలిపోటులా రూ.80 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిల చెల్లించకపోతే సరఫరా నిలిపేస్తామంటూ నోటీసులు జారీ చేసింది. అలాగే స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇస్తామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం మొదట ఇచ్చిన రూ.500 కోట్లలో రూ.237 కోట్లు జీఎస్టీకి చెల్లించగా మిగిలిన ధనంతో ముడి పదార్థాలు కొనుగోలు చేశారు. రెండోసారి ప్యాకేజీ పేరుతో రూ.1140 కోట్లు ఇచ్చినట్టే ఇచ్చి.. బ్యాంకులకు రుణాల పేరిట తిరిగి తీసేసుకుంది. ఇలా ప్రతి విషయంలోనూ ప్లాంట్‌ని నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తుంటే కూటమి నేతలు నోరుమెదపకపోవడం ఏంటని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

నక్కపల్లిలో ప్రైవేట్ ప్లాంట్‌కు సొంత గనులా?

అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పైగా దానికి సొంత గనుల కేటాయింపులోనూ రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఉన్న స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ప్రైవేట్‌కు కొమ్ముకాస్తుండడం చూస్తే.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు విశాఖ ఉక్కుపై ఉన్నది కపట ప్రేమ అని తేటతెల్లమవుతోందంటూ ఉద్యోగ సంఘ ప్రతినిధులు విమర్శిస్తున్నారు.

ఉద్యోగులపై నిందలు వేయడం సరికాదు



స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఉంటే సెయిల్ కంటే ఎక్కువ లాభాలు సాధించేది. ఉక్కు యాజమాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది కానీ ఉద్యోగులు కాదు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నంలో చేస్తున్న సహాయ నిరాకరణ వల్ల స్టీల్‌ప్లాంట్ ఈ పరిస్థితికి చేరింది.. తప్పు ఉద్యోగుల వల్ల కాదు. సీఎం చంద్రబాబుకి అందిన తప్పుడు సమాచారం వల్లే ఆయన అలా మాట్లాడుతున్నారేమో.

– మంత్రి రాజశేఖర్,
స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి

గనుల కేటాయింపులో వివక్ష కారణంగా..?



గతంలో వరుసగా సాధించిన లాభాలతో 6.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి, ఆ తర్వాత 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికిప్లాంట్ విస్తరణ జరిగింది. ఒక రకంగా విస్తరణ స్టీల్‌ప్లాంట్‌కు నష్టం తెచ్చిందని చెప్పవచ్చు. విస్తరణ పూర్తయ్యే నాటికి ఉన్న వనరులన్నీ కరిగిపోగా రుణాలకు వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా దేశంలోని ప్రైవేటు ప్లాంట్లకు గనులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించడంలో వివక్ష చూపుతూ వస్తుంది. దీని వల్ల ఇతర ప్లాంట్లలో టన్నుకు 40 శాతం ముడి పదార్థాలకు వ్యయం అవుతుండగా సొంత గనులు లేని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 65 శాతం వ్యయం అవుతోంది. కొన్నిసార్లు ఉత్పత్తి వ్యయం కంటే తక్కువకే ఉత్పత్తులను స్టీల్‌ప్లాంట్ అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో గత నాలుగున్నరేళ్ల కాలంలో మూడేళ్ల పాటు నష్టాలను చవిచూసింది. ఈ పరిస్థితుల్లో ప్లాంట్ రుణాలు రూ.20 వేల కోట్లకు మించిపోయాయి. అయితే స్టీల్‌ప్లాంట్ ఈ 30 ఏళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పన్నుల రూపేణా రూ.40 వేల కోట్లు చెల్లించడం గమనార్హం. వీటిని వద్దని చెప్పినా ప్లాంట్ సజీవంగా బతికేది.

అలా చూస్తే.. విశాఖ మొత్తం ఎర్రమట్టి దిబ్బలే!

- భీమిలి సొసైటీకి ప్రభుత్వం 373 ఎకరాలను కేటాయించింది
- జీఐఎస్ గుర్తింపులో భాగంగా 91 ఎకరాలు కోల్పోయాం
- జనసేన కార్పొరేటర్ హైకోర్టులో వేసిన పిల్‌పై కౌంటర్ వేస్తున్నాం
- భీమిలి మ్యూచువల్లీ సొసైటీ అధ్యక్షుడు హరిగోపాలరావు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న భీమిలి సొసైటీ అధ్యక్షుడు హరిగోపాలరావు, కార్యదర్శి సూరిబాబు, ఉపాధ్యక్షుడు నారాయణరావు

సాక్షి, విశాఖపట్నం: ఎర్రగా కనిపించేదంతా ఎర్రమట్టి దిబ్బలే అన్నట్లుగా అబద్ధపు ఆరోపణలతో జనసేన కార్పొరేటర్ హైకోర్టులో పిల్ వేశారని.. అలా చూస్తే విశాఖపట్నం మొత్తం ఎర్రమట్టి దిబ్బలే ఉంటాయని భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు గోన హరిగోపాలరావు అన్నారు. ఎర్రమట్టి దిబ్బలను ఆనుకుని ఉన్న సొసైటీ స్థలం వివాదంపై ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1970లో ఈ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉన్న సమయంలో ప్రభుత్వానికి 400 ఎకరాల భూమిని కోరామని.. 1983లో 373.95 ఎకరాల స్థలాన్ని అప్పటి మార్కెట్ రేట్ ప్రకారం కొనుగోలు చేశామన్నారు. పక్కన ఉన్న కొంత భాగాన్ని ఐఎన్ఎస్ కళింగకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. భూమి ధరలకు సంబంధించి న్యాయపరమైన వివాదాల కారణంగా 2009లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1996 మార్కెట్ విలువ ఆధారంగా ప్రభుత్వం ధరను నిర్ణయించిందన్నారు. ఆ మొత్తం కూడా చెల్లించడంతో భీమునిపట్నం తహసీల్దార్ 2014లో అధికారికంగా 373.95 ఎకరాల భూమిని సొసైటీకి అప్పగించారని వెల్లడించారు. అనంతరం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) 262.92 ఎకరాల భూమిని ఎర్రమట్టి దిబ్బలు జియో హెరిటేజ్ సైట్ (జీహెచ్ఎస్)గా గుర్తించిందన్నారు. ఇందులో తమ సొసైటీకి చెందిన 91 ఎకరాల భూమిని కూడా జీహెచ్ఎస్‌లో ఉన్నట్లు పేర్కొందన్నారు. తాము కొనుగోలు చేసిన స్థలంలో ఈ భాగాన్ని ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశామని.. అయినప్పటికీ రూపాయి కూడా పరిహారం అందలేదన్నారు. ఈ స్థలాన్ని మినహాయిస్తూ.. సుమారు 280 ఎకరాల్లో 242.47 ఎకరాలకు మాత్రమే లే అవుట్ ప్లాన్ కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. 2023లో తాత్కాలిక లేఅవుట్ ప్లాన్‌ను జీవీఎంసీ జారీ చేసిందన్నారు. లేఅవుట్ రుసుం రూ.5.64 కోట్లు, టీఎల్‌పీ ప్రొసీడింగ్‌ల తరువాత, సొసైటీ 242.47 ఎకరాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జల స్థాయిలను పెంచడంపై దృష్టి సారించి పనులు ప్రారంభించామన్నారు. అయితే ఈ ఏడాది జూలైలో పనులు నిర్వహిస్తున్నప్పుడే.. దుమారం చెలరేగిందన్నారు. భీమిలి సొసైటీకి రాజకీయ రంగు పులమొద్దని.. మా లేఅవుట్ ప్లాన్‌ను మాకు ఇప్పించాలని అధికారులను హరిగోపాలరావు కోరారు.

అధికారులకు అవగాహన లేదు

ఇటీవల నిర్వహించిన జీఎస్ఐ సర్వేలో కూడా జియో–హెరిటేజ్ సరిహద్దు రేఖలను పరిష్కరించిందని సొసైటీ కార్యదర్శి పెదిరెడ్ల సూరిబాబు తెలిపారు. 10 నుంచి 15 మీటర్ల బఫర్ జోన్‌ను నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసినా.. ఇది ఎర్రమట్టి దిబ్బలంటూ 22వ వార్డుకి చెందిన జనసేన కార్పొరేటర్ హైకోర్టులో పిల్ వేయడం సరికాదన్నారు. సబ్జెక్ట్‌పై సరైన అవగాహన లేకుండా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం ఆమోద యోగ్యం కాదన్నారు. ఈ భూ వ్యవహారంపై కొత్తగా వచ్చిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన లేదని వ్యాఖ్యానించారు. కార్పొరేటర్ హైకోర్టులో వేసిన పిల్‌పై కౌంటర్ వేస్తున్నామని.. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలకు స్వస్తి పలకాలని కోరారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు వి.నారాయణరావు, సభ్యులు పాల్గొన్నారు.

'మిషన్‌లైఫ్'తో నాణ్యమైన విద్యుత్ సరఫరా

మిషన్‌లైఫ్ అమలుకు మద్దతు ప్రకటించిన ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం: మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని అమలు చేస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి రూపొందించిన 'మిషన్ లైఫ్' పోస్టర్‌ను కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ) సభ్యుడు ప్రవీణ్ గుప్తా, బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరాతో కలిసి సీఎండీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ మిషన్‌లైఫ్ అమలుకు బహిరంగ మద్దతు ప్రకటించిన తొలి డిస్కంగా ఈపీడీసీఎల్ నిలవడం ఆనందంగా ఉందన్నారు. వ్యర్థాల తగ్గింపు, నీరు, ఇంధన సంరక్షణ, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఈఈ సర్టిఫైడ్ ఇంధన సామర్థ్య ఉపకరణాల వినియోగాన్ని ప్రోత్సహించడం తదితర చర్యలపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. బీఈఈ, ఏపీఎస్ఈసీఎంతో కలిసి ఈపీడీసీఎల్ పరిధిలో సమగ్ర కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మిషన్ లైఫ్ అమలుతో ఈపీడీసీఎల్ పరిధిలో ఆర్థిక వృద్ధితో పాటు వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరా మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంతో కలిసి బీఈఈ.. మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని తిరుపతిలో అమలు చేసి, దేశవ్యాప్తంగా సుస్థిర విధానాలకు నమూనాగా నిలిపేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. జనవరి 2024 నాటికి ఎస్అండ్ఎల్ కార్యక్రమం పరిధిలోకి 35 ఇంధన సామర్థ్య ఉపకరణాలు వచ్చాయని, దీంతో రూ.54,324 కోట్ల విలువైన 81.64 బిలియన్ యూనిట్ల విద్యుత్తు పొదుపు చేసినట్లు తెలిపారు. డిస్కంలు తమ దీర్ఘకాలిక కమ్యూనికేషన్ వ్యూహాల్లో మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీఈఏ సభ్యుడు ప్రవీణ్ గుప్తా మాట్లాడుతూ రెన్యూవబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్(ఆర్పీవో)పై ప్రాంతీయ వర్క్ షాప్ నిర్వహించిన ఏపీని ప్రశంసించారు. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఆర్పీవో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డైరెక్టర్లు, సీజీఎంలు పాల్గొన్నారు.



లైఫ్ మిషన్ పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

ప్రాణం తీసిన ఈత సరదా

- సముద్రంలో మునిగి యువకుడి మృతి
- మృతుడు పెందుర్తి మండలం నాయుడు తోట వాసిగా గుర్తింపు



వెంకట సాయి అభిరామ్ మృతదేహం

రాంబిల్లి(యలమంచిలి): ఈత సరదా యువకుడి ప్రాణం తీసింది. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన యువకుడు కెరటాలకు కొట్టుకుపోయి అందని తీరాలకు వెళ్లిపోయాడు. రాంబిల్లి సీఐ నర్సింగరావు, మృతుడు తండ్రి జగన్నాథరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి మండలం, నాయుడుతోట గ్రామానికి చెందిన శ్రీగుడి వెంకట సాయి అభిరామ్(21) ఆదివారం తెల్లవారుజామున నలుగురు స్నేహితులతో కలసి ద్విచక్ర వాహనాలపై రాంబిల్లి మండలం సీతపాలెం సముద్ర తీరానికి వెళ్లారు. ఉదయం 6 గంటలకు సముద్రంలో సరదాగా స్నానానికి దిగి ఈత కొడుతూ ఉల్లాసంగా గడిపారు. ఉదయం 7.30 గంటల సమయంలో కొంత అలసటకు గురైన అభిరామ్ సముద్రంలో ఉన్న రాయి మీదకు ఎక్కి సేదతీరుతున్నాడు. ఇంతలో అకస్మాత్తుగా ఒక పెద్ద కెరటం రావడంతో సముద్రంలో పడిపోయాడు. అలల తాకిడికి లోపలికి కొట్టుకుపోతుండగా గమనించిన ముగ్గురు స్నేహితులు స్థానిక మత్స్యకారులకు సమాచారం అందించారు. వారు బోటు సహాయంతో అపస్మారక స్థితిలో ఉన్న అభిరామ్‌ను రక్షించారు. కొన ఊపిరితో ఉన్న అభిరామ్‌ను స్నేహితులు తమ ద్విచక్ర వాహనాల మీద అచ్యుతాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అభిరామ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు, బంధువులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. అభిరామ్ ఇటీవల బీటెక్ పూర్తి చేసి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడని, కొద్ది రోజుల్లో విధుల్లో చేరాల్సి ఉందని రోదించారు. ఒక్కగానొక్క కుమారుడు ఇలా సముద్రంలో అలల తాకిడికి కొట్టుకుపోయి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు విషాదంలో మునిగిపోయారు. జగన్నాథరావు ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ కుమారుడు అభిరామ్‌ను అల్లారు ముద్దుగా పెంచి బీటెక్ వరకు చదివించారు. అంది వచ్చిన ఏకైక కుమారుడు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆస్పత్రిలో ఆవరణలో ఆయన కన్నీరు మున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది. జగన్నాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాంబిల్లి సీఐ సీహెచ్.నర్సింగరావు తెలిపారు.

అయోమయం.. గందరగోళం!

- తేలని మున్సిపల్ టీచర్ల పదోన్నతుల లెక్క
- ఈ నెల 6, 8 తేదీల్లో ప్రమోషన్ల కౌన్సెలింగ్
- ఇంకా బయటకు రాని తెలుగు, హిందీ సీనియారిటీ జాబితాలు
- ఖాళీల వివరాలు వెల్లడించని విద్యాశాఖాధికారులు
- ఎయిడెడ్ టీచర్ల సర్దుబాటుతో సమస్య జటిలం



మున్సిపల్ స్కూల్లో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

విశాఖ విద్య: పాఠశాల విద్యలోకి విలీనమైన తరువాత తొలిసారిగా జరుగుతున్న మున్సిపల్ టీచర్ల పదోన్నతుల ప్రక్రియ గందరగోళంగా మారుతోంది. జీవీఎంసీ పరిధిలోకి వచ్చే విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులు పదోన్నతుల కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తుండగా, జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు అవలంభిస్తున్న విధానాలు వీరిని అయోమయానికి గురిచేస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో అన్ని క్యాడర్లు కలిపి 449 ఖాళీలు ఉన్నట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ జీవీఎంసీ పరిధిలో క్యాడర్ల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయి? ఎంతమందికి పదోన్నతులిస్తారనే స్పష్టత లేకపోవటంపై ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జాబితాల వెల్లడిలో జాప్యం

జీవీఎంసీ పరిధిలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల సీనియార్టీ జాబితాలను అక్టోబర్ 28న ప్రకటించాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ, ఈ నెల 1న వీటిని వెల్లడించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అది కూడా కొన్ని సబ్జెక్టులకే. గ్రేడ్–2 హెచ్ఎం, పీఎస్ హెచ్ఎం, ఎస్ఏ గణితం, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ సైన్సు, సోషల్ సబ్జెక్టులకు మాత్రమే జాబితాలు విడుదల చేశారు. తెలుగు, హిందీ సబ్జెక్టులకు సంబంధించిన జాబితాలు ప్రకటించలేదు. సోమవారం నాటికి అభ్యంతరాలను స్వీకరించి, ఫైనల్ జాబితాలను ప్రకటించాల్సి ఉంది. దీనిపై సరైన సమాచారం లేకపోవటంతో తమ అభ్యంతరాలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ఖాళీలపై స్పష్టత ఏదీ?


ఎయిడెడ్ స్కూళ్ల నుంచి ఇటీవల ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినప్పుడు, కొంతమందికి జీవీఎంసీ పరిధిలో పోస్టింగ్‌లు ఇచ్చారు. అప్పటి అధికారుల హయాంలో జరిగిన లోపాయికారీ ఒప్పందాలు ఇప్పుడు సమస్యగా మారినట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చసాగుతోంది. పోస్టుల సర్దుబాటు తరువాత క్యాడర్ స్ట్రెంత్‌ను సరిచేయకపోవటంతో, ప్రస్తుతం ఇచ్చే ప్రమోషన్లలో రోస్టర్ కేటాయింపు లెక్కతప్పింది. జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ సైతం ఇదే విషయాన్ని ఎత్తిచూపటంతో, ఖాళీల గుర్తింపు వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. వాస్తవంగా ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది తెలిస్తేనే, రోస్టర్ అమలు, డీఎస్సీకి ఎన్ని కేటాయించాలి, పదోన్నతుల్లో ఎన్ని భర్తీ చేయాలన్నది తేలుతుంది. దీనిపై స్పష్టత లేకపోవటంతో షెడ్యూల్ మేరకు పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగుతుందా? లేదా? అనే అనుమానాలను ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు.

పదోన్నతుల షెడ్యూల్

సీనియార్టీ జాబితా ప్రకటన	అక్టోబర్ 28
అభ్యంతరాల స్వీకరణ	నవంబర్ 4
గ్రేడ్–2 హెచ్ఎంల కౌన్సెలింగ్	నవంబర్ 6
ఎస్ఏ/పీఎస్ హెచ్ఎంల కౌన్సెలింగ్	నవంబర్ 8

విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం స్మార్ట్ షాక్ ఇవ్వబోతోంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, నిర్వహణ పేరిట భారీగా భారం వేయనుంది. పంపిణీ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ పథకం–ఆర్డీఎస్ఎస్ కింద రాష్ట్రంలోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లకు 2025 డిసెంబర్ నాటికి దశలవారీగా స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయనుంది. పరోక్షంగా మీటర్ల తయారీ కంపెనీలకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. – మధురవాడ

SMART షాక్



తొలుత ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

- ఇప్పటికే 9,200 ఏర్పాటు పూర్తి
- నాడు అడ్డగోలు ఆరోపణలు చేసిన కూటమి నేతలు
- నేడు గుట్టుచప్పుడు కాకుండా పనికానిచ్చేస్తున్న కూటమి ప్రభుత్వం

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చాపకింద నీరులా సాగుతోంది. విశాఖలో ఇప్పటికే 9,200 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అనుమతి పొందిన ఓ బడా వ్యాపార దిగ్గజం ప్రజలకు 'స్మార్ట్'షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. జిల్లాలో భీమిలి, విశాఖ తూర్పు, పెందుర్తి, విశాఖ నార్త్ నియోజక వర్గాలు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. జిల్లాలో 9,97,546 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తొలి విడతలో ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లలో 9,539 స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందులో ఇప్పటికే 9,200 పూర్తి చేశారు. దాదాపుగా 80 శాతం ప్రస్తుతం ఉన్న పాత మీటర్లు తీసేసి.. వాటి స్థానంలో కొత్త మీటర్లు ఏర్పాటు చేసేశారు. దీనిపై అధికార యంత్రాంగం మాత్రం వివరాలు వెల్లడించకుండా గోప్యత పాటిస్తోంది.



మధురవాడ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

స్మార్ట్ మీటర్ల వివరాలు

జోన్	విద్యుత్ కనెక్షన్లు	స్మార్ట్ మీటర్లు	టార్గెట్ పూర్తి చేసింది
వాల్తేరు జోన్-1	2,81,959	2,942	2,900
మల్కాపురం జోన్-2	3,23,491	1,685	1600
మధురవాడ జోన్-3	3,92,096	4,912	4700
మొత్తం	9,97,546	9,539	9,200



కొమ్మాదిలోని ప్రైవేట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మీటర్లు

నాడు నై.. నేడు జై

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్రంగా వ్యతిరేకించింది. అధికారం చేపట్టిన తర్వాత పసుపు జెండా ఊపింది. కేంద్రం ఏది చెబితే దానికి తల ఊపేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఇలా రెండు నాల్కల ధోరణిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్యులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లతో మరో వివాదానికి తెరలేపింది. న్యూ ఇన్నోవేషన్‌తో క్వాలిటీ విద్యుత్ అందించే పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సరఫరా వ్యవస్థలో మార్పులు, చేర్పులు చేసింది. దీని కాంట్రాక్ట్‌ను ఓ వ్యాపార దిగ్గజం చేజిక్కించుకుంది. దీంతో ప్రభుత్వ, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లలో ఏర్పాటు పనులు దాదాపుగా 80 శాతం పూర్తయ్యాయి.

ముందే డబ్బులు చెల్లించాలి

స్మార్ట్ అంటే ప్రీ పెయిడ్ కరెంట్ మీటర్ అన్నమాట. ప్రస్తుతం కరెంట్ వాడుకుని తర్వాత చెల్లిస్తున్నాం. స్మార్ట్ మీటర్లు ఏర్పాటైతే ముందే డబ్బులు కట్టి తర్వాత కరెంట్ వాడుకోవాలి. ఫోన్లు, టీవీలకు డీటీహెచ్, జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, ఇంటర్నెట్, బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్‌కు రీచార్జ్ చేసుకుని ఎలా వాడుతున్నామో అదే విధంగా విద్యుత్ అవసరాలకు కూడా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రీపెయిడ్ రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీచార్జ్ అయిపోయిన తర్వాత సెల్‌ఫోన్ కట్ అయిపోయనట్టే అర్ధరాత్రి.. అపరాత్రి.. అన్న బేధం లేకుండా విద్యుత్ సరఫరా ఆగిపోతుంది.

అధికారులకు తలనొప్పి

ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. హెచ్‌వోడీగా ఉన్న అధికారి నంబర్ అనుసంధానం చేశారు. దీంతో అధికారుల జేబుకు చిల్లు పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యుత్ బిల్లుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసినా.. చేయకపోయినా హెచ్‌వోడీగా ఉన్న అధికారే చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇక ఆస్పత్రులకీ మినహాయింపు లేదు. ఇప్పుడు ఏర్పాటు చేస్తున్న కొత్త మీటర్‌కు డబ్బులు వసూలు చేయకపోయినా తర్వాత వసూలు చేస్తారని వామపక్ష నేతలు చెబుతున్నారు.

స్మార్ట్ మీటర్లకు మేం వ్యతిరేకం



స్మార్ట్ మీటర్లు పేరులోనే స్మార్ట్ తప్పా..పనిలో మాత్రం వాతలే..చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడినా విద్యుత్ చార్జీల భారం కచ్చితంగా మోపుతుంది. ప్రజలకు కనీస అవసరాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. నామమాత్రపు విద్యుత్ చార్జీలు కాకుండా ఇలా దోపిడీ చేయడం సరికాదు. స్మార్ట్ మీటర్ల వల్ల భవిష్యత్‌లో చాలా సమస్యలొస్తాయి. సామాన్యులకు ఇబ్బందులు తప్పవు. స్మార్ట్ మీటర్లకు మా పార్టీ పూర్తి వ్యతిరేకం. అవసరం అయితే ఆందోళనకు కూడా వెనుకాడబోం.

–డి.అప్పలరాజు, సీపీఎం కార్యదర్శి, మధురవాడ జోన్

• బతుకు పోరాటం

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఒక్క పూట తిండిలేక అల్లాడిపోయే ప్రాణాలెన్నో.. కట్టు కోవడానికి బట్ట లేక తల్లడిల్లే మనసులెన్నో.. ఉండటానికి గూడు లేక రహదారిపై నిదురించే అనాథ బతుకులెన్నో.. పేగులు చుట్టేసే దుర్వాసన వెదజల్లుతున్నా.. అత్తరులా భావిస్తూ ఆకలి పోరాటం చేసే వాళ్లు ఎందరో.. దుర్వాసన వెదజల్లుతున్న భరిస్తూ కుటుంబపోషణ కోసం ప్లాస్టిక్ బాటిళ్లను సేకరిస్తున్నారు కొందరు. వాటిని శుభ్రం చేసి విక్రయిస్తూ కుటుంబపోషణ సాగిస్తున్నారు. కాన్వెంట్ జంక్షన్‌లో ఉన్న ఓ మురుగునీటి కాలువలో జీవన పోరాటం చేస్తున్నారు.

• 'దమ్ మారో దమ్'

గంజాయి నిర్మూలనకు 100 రోజుల ప్రణాళిక అంటూ కూటమి ప్రభుత్వం అధికారంలోరాగానే ఊదరగొట్టింది. నిజంగా 100 రోజుల్లో గంజాయి నిర్మూలిస్తామని ప్రకటించగానే.. అందరూ హర్షించారు. గంజాయి రహిత విశాఖను చూడబోతున్నామని ఆనందించారు. కట్ చేస్తే నగరవ్యాప్తంగా గంజాయి గుప్పుమంటోంది. రోజూ జిల్లాలో ఏదో ఒక చోట గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతూనే ఉన్నారు. పోలీసులకు కళ్లుగప్పి అక్రమ రవాణా చేసే వాళ్లూ ఉన్నారు. నగరం నడిబొడ్డున ఉన్న రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి ఫుట్‌పాత్‌పై అందరూ చూస్తుండగానే 'దమ్ మారో దమ్' అంటూ గంజాయి పీల్చుతున్నవారు కనిపిస్తూనే ఉన్నారు. ఇందుకు నిదర్శనమే ఈ చిత్రం.



-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆర్.కె.బీచ్‌కు పోటెత్తిన జనం

జనసంద్రం



ఏయూక్యాంపస్: నగరవాసులకు సాగరతీరం ఆటవిడుపు కేంద్రంగా మారింది. కార్తీక మాసం, ఆదివారం కావడంతో సాగర తీరం జనసంద్రంగా మారింది. నగరవాసులతో పాటు పర్యాటకుల సందడి కనిపించింది. ఆర్.కె బీచ్‌కు పెద్ద సంఖ్యలో నగరవాసులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో చేరుకుని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అధిక శాతం మంది సముద్రం వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. ప్రమాదకరమని తెలిసినా కొంత మంది సముద్ర తీరంలో స్నానాలు చేస్తూ గడిపారు. తీరంలో కనిపించే రాళ్లపై నిల్చొని యువతీయువకులు ఫొటోలకు ఫోజులిచ్చారు.

ఆకట్టుకున్న లేజర్ షో

జీవీఎంసీ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద ఆదివారం రాత్రి లేజర్ షో నిర్వహించారు. ఈ షోను తిలకించడానికి పెద్ద సంఖ్యలో నగరవాసులు తరలివచ్చారు. దేశభక్తిని రేకెత్తించే విధంగా ఈ షో అద్భుతంగా సాగింది.



ఫొటో తీసుకుంటున్న ఓ కుటుంబం

కూల్‌జోన్ అధినేత ఆత్మహత్య



సాయిగణేష్(ఫైల్)

పీఎంపాలెం: వ్యాపారపరమైన ఒత్తడి తట్టుకోలేక వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన కొవ్వూరు సాయి గణేష్ (39) లాసన్స్ బే కాలనీలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతనికి భార్య విజయకుమారి, కుమార్తెలు కీర్తన, సరిత ఉన్నారు. సాయిగణేష్‌కు కూల్ జోన్ పేరుతో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా 14 షాపులు (ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు) ఉన్నాయి. డైమండ్ పార్కులో ప్రధాన షాపు ఉండగా.. అదే ప్రాంతంలో మరో షాపు రావడంతో వ్యాపారంలో పోటీ పెరిగింది. దీంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడు. శనివారం సాయంత్రం హైవేను ఆనుకుని ఉన్న ఓ ప్రముఖ లాడ్జిలో రూం అద్దెకు తీసుకున్నాడు. సోమవారం ఉదయం 9 గంటల వరకు తలుపులు తెరవకపోడంతో గది శుభ్రం చేసేందుకు వెళ్లిన బాయ్‌కి అనుమానం వచ్చి లాడ్జి యజమానికి సమాచారం అందించాడు. తలుపులు విరగ్గొట్టి చూడగా సాయి గణేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సీఐ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విజయకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తల్లి మందలించిందని యువకుడి బలవన్మరణం

పెందుర్తి: జులాయిగా తిరుగుతున్నాడని తల్లి మందలించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెందుర్తి గాంధీనగర్‌లో జరిగిన ఈ ఘటన వివరాలివీ.. స్థానికంగా నివాసం ఉంటున్న మళ్ల అప్పారావు, రూప దంపతుల కుమారుడు భానుప్రకాష్ (20) చదువు మధ్యలో ఆపేశాడు. పూర్ణామార్కెట్‌లో పూల దుకాణం నిర్వహిస్తున్న తల్లి రూపకు సహాయంగా ఉండేవాడు. అయితే ఇటీవల భానుప్రకాష్ జులాయిగా తిరగడంతో తల్లి తరచూ మందలిస్తుండేది. శనివారం రాత్రి కూడా కుమారుడిని మందలించింది. ఈ నేపథ్యంలో గదిలోకి వెళ్లిన భానుప్రకాష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా కృష్ణకుమార్



సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీగా ఆత్మకూరి కృష్ణకుమార్ ఎన్నికైనట్టు ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకర్‌రావు ప్రథమ కుమారుడు కృష్ణకుమార్ ఇప్పటివరకు ట్రస్టీగా ఉన్నారు. 2023 ఫిబ్రవరిలో మేనేజింగ్ ట్రస్టీ పదవికి మణిమాల రాజీనామా చేయడంతో అప్పటి నుంచి ఎవరినీ నియమించలేదు. రెండు రోజుల కిందట శంకర్ ఫౌండేషన్ బోర్డు చైర్మన్ ఎం.రాందాస్ అధ్యక్షతన జరిగిన 172వ ట్రస్ట్‌బోర్డు సమావేశంలో కృష్ణకుమార్‌ను మేనేజింగ్ ట్రస్టీగా ప్రొఫెసర్ ఎ.ప్రసన్నకుమార్, ఆత్మకూరి విజయ్‌కుమార్ తదితరులు ఎన్నుకున్నారు. ఏయూలో అప్లైడ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన కృష్ణకుమార్ 13 ఏళ్లకు పైగా శంకర్ ఫౌండేషన్ బోర్డులో పనిచేశారు. ఆయన్ని ఆస్పత్రి వైద్యులు, ఉద్యోగులు అభినందించారు. ఫౌండేషన్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని కృష్ణకుమార్ తెలిపారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీకి ప్రత్యేక స్థానం

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

సీతమ్మధార : వైజాగ్ ఫిల్మ్ సొసైటీకి ప్రత్యేక స్థానం ఉందని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నూతన కార్యవర్గ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అంటే ముందుగా గుర్తుకొచ్చేది నరవ ప్రకాష్ అని, మంచి చిత్రాలను ప్రజలకు చేరవేయడంలోనూ వైజాగ్ ఫిల్మ్ సొసైటీకి మంచి పేరుందన్నారు. స్టార్ మేకర్ ఎల్.సత్యానంద్ మాట్లాడుతూ భావితరాలకు మన చరిత్ర, విశిష్టతపై ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధ్యక్షుడు ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కార్యదర్శి నరవ ప్రకాష్ మాట్లాడుతూ సొసైటీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యక్షురాలు ఎ.ఉషారాణి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, బి.గణేశ్వర బాబ్జీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు విశాఖ కుర్రాళ్లు



ప్రదీప్,రాజ్‌కుమార్

విశాఖ స్పోర్ట్స్: జాతీయ సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు విశాఖకు చెందిన ప్రదీప్, రాజ్‌కుమార్ ఆడనున్నారు. సంతోష్ ట్రోఫీ ఈ నెల 15న ప్రారంభం కానుండగా.. అనంతపురం వేదికగా ఏపీ జట్టు గ్రూప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ పూల్‌లో ఏపీతో పాటు మరో మూడు జట్లు పోటీపడనున్నాయని జిల్లా ఫుట్‌బాల్ ఎలైన్స్ వెల్ఫేర్ సంఘం కార్యదర్శి చినబాబు తెలిపారు.

ఉమ్మడి విశాఖ సూపర్‌వైజర్ల సంఘం ఎన్నిక

ఎంవీపీకాలనీ: ఉమ్మడి విశాఖ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం సమావేశం ఆదివారం నగరంలో జరిగింది. ఈ సమావేశంలో ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై సంఘ నాయకులు, సభ్యులు చర్చించారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా జిల్లా సూపర్‌వైజర్ల సంఘంగా ఏర్పడ్డారు. సంఘ అధ్యక్షురాలిగా జేటీఎస్ జ్యోతి, కార్యదర్శిగా కె.లలిత, కోశాధికారిగా రంజాన్ బీబీ ఎంపికయ్యారు. అన్ని జిల్లా కార్యాలయాల్లో సూపరింటెండెంట్ పోస్టుల భర్తీ, ఏజెన్సీ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం, ఆర్టీఐ చట్టం ద్వారా ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు, తదితర తీర్మానాలు చేశారు. సమావేశంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

అసౌకర్యాల తీరం

రుషికొండ బీచ్.. మన రాష్ట్రంతో పాటు దేశ విదేశాల నుంచి ఎంతో మంది పర్యాటకులు సందర్శించే అంతర్జాతీయ పర్యాటక ప్రాంతం. విశాఖపట్నం వచ్చే పర్యాటకులెవరైనా రుషికొండ బీచ్‌ను సందర్శించాల్సిందే. అలాంటి ఈ బీచ్‌లో నిర్వహణ లేక.. కళ తప్పింది. అడుగడుగునా నెలకొన్న సమస్యలు.. ఇక్కడకు వచ్చిన పర్యాటకులకు స్వాగతం పలుకుతున్నాయి.

కళావిహీనంగా రుషికొండ బీచ్

- తీరం వెంబడి దర్శనమిస్తున్న వ్యర్థాలు
- ధ్వంసమైన ఫుట్‌పాత్‌లు
- మాయమైన హైమాస్ట్ లైట్లు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పర్యాటకులు



అందినంత ఎత్తులో ప్రమాదం

కొమ్మాది: డెన్మార్క్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్(ఎఫ్ఈఈ) బీచ్‌లకు బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ ఇస్తుంది. ఈ సర్టిఫికెట్ ఇచ్చేప్పుడు బీచ్‌లకు సంబంధించి పర్యావరణం, నీటి నాణ్యత, పరిశుభ్రత నిర్వహణ, బీచ్‌ల వద్ద భద్రత తదితర 33 ప్రమాణాలను పరిశీలించి.. వాటికి అనుగుణంగా ఉంటేనే ఈ బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ అందజేస్తుంది. మన రాష్ట్రంలో అటువంటి విశిష్టమైన, విలువైన సర్టిఫికెట్‌ను పొందిన ఒకే ఒక బీచ్.. రుషికొండ బీచ్. కానీ నేడు అధికారుల నిర్లక్ష్యధోరణి కారణంగా కళావిహీనంగా మారి పర్యాటకులకు నిరాశ కలిగిస్తోంది. ఎంతో ఊహించి కుటుంబాలతో దేశ, విదేశాల నుంచి ఇక్కడ బీచ్‌లో గడిపేందుకు వచ్చిన వారికి చేదు అనుభవాలను మిగులుస్తోంది.



ధ్వంసమైన ఫుట్‌పాత్

అడుగడుగునా సమస్యలే..

ఎంతో సువిశాలమైన, సుందరమైన ఈ బీచ్‌లో నేడు అడుగడుగునా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. తీరం వెంబడి పెద్ద ఎత్తున వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఇక్కడ వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు ప్రస్తుతం మాయమైపోయాయి. విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టాయి. ఫ్యూజ్ బాక్స్‌లు చిన్న పిల్లలకు అందేంత ఎత్తులో ఉండటంతో ఏ క్షణంలోనైనా ప్రమాదం పొంచి ఉంది. అడుగడుగునా ఫుట్‌పాత్‌లు ధ్వంసమైపోయాయి. వ్యూ టవర్ తీగలతో చుట్టుకుని దర్శనమిస్తోంది. చిరిగిన వలలు ఎక్కడబడితే అక్కడ కనిపిస్తున్నాయి. కుక్కలు పర్యాటకులకు ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. ముఖ్యంగా ఇక్కడకు వచ్చే పర్యాటకులకు పార్కింగ్ సమస్య పెద్ద తలనొప్పిగా మారింది. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం పూట స్థానికంగా ఉండే సీనియర్ సిటిజన్లు వాకింగ్‌కు వచ్చినప్పుడు పార్కింగ్ రుసుం వసూలు చేయడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. శని, ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో ఈ బీచ్‌కు వేలాదిమంది పర్యాటకులు వస్తుంటారు. వీరికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు విఫలమవుతున్నారు. పర్యాటకులు స్నానం చేస్తూ మృత్యువాత పడ్డ ప్రదేశాల్లో గతంలో ఏర్పాటు చేసిన ఎర్ర జెండాలు ఇప్పుడు మాయమైపోయాయి. ప్రస్తుతం స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేదు. వీటితో పాటు చాలా సమస్యలు పర్యాటకులను అసంతృప్తికి గురిచేస్తున్నాయి.



పిచ్చి మొక్కలతో నిండిన వ్యూ టవర్..